


నిందితుడికి రిమాండ్

మద్యం దుకాణంలో దొంగతనం చేస్తూ, అడ్డొచ్చిన యువకుడిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. 8లో ▸



చోరీలకు నిలయాలు

శివారులో దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా అందిన కాడికి దోచుకొని పరారవుతున్నారు. 8లో ▸



న్యూస్‌రీల్

నేటి నుంచి ధ్యానోత్సవం

ఇబ్రహీంపట్నం: హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామ చంద్ర మిషన్ సంయుక్తంగా శని, ఆది, సోమవారాల్లో ఇబ్రహీంపట్నంలోని ఓసీ కమ్యూనిటీ హాల్‌లో ధ్యానోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15 సంవత్సరాలు దాటిన వారంతా ఈ ధ్యానోత్సవానికి హాజరు కావొచ్చని తెలిపారు. ధ్యానంతో కలిగే భౌతిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను ఈ కార్యక్రమంలో వివరించనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా గీతావనజాక్షి



మొయినాబాద్: పెద్ద మంగళారం మాజీ సర్పంచ్, న్యాయవాది గీతావనజాక్షి అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారానికి చెందిన గీతావనజాక్షి న్యాయవాదిగా పనిచేస్తున్నారు. 2013 నుంచి 2018 వరకు ఆమె గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. మహిళలకోసం లీగల్ క్లినిక్‌ను సైతం నడుపుతున్నారు. చేవెళ్ల జూనియర్ సివిల్ కోర్టు, ఇతర కోర్టులకు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా ఆమెను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులైన సందర్భంగా పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేయాలి



దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్స్‌తో పాటు అన్ని రకాల పరీక్ష ఫలితాలను నిలిపివేయాలని కోరుతూ ఐదు రోజులుగా షాద్‌నగర్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన దీక్షలు చేపడుతున్నారు. దీక్ష శిబిరానికి శుక్రవారం గోవింద్ విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్గీకరణ అమలులో లేకపోవడంతో కొన్ని దశాబ్దాలుగా విద్య, ఉద్యోగ రంగాల్లో మాదిగలకు ఎంతో అన్యాయం జరుగుతోందని అన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 17న అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామని ప్రకటించిన నేపథ్యంలో మాదిగలు అప్రమత్తంగా ఉండి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ, నాయకులు భిక్షపతి, శివ, పరుశరాం, చిత్ర శ్రీను, చెన్నగళ్ల శ్రావణ్‌కుమార్, పాండు, సురేష్, బాల్‌రాజ్, శేఖర్, నాగేష్ పాల్గొన్నారు.

కుల్ఫీ ఐస్‌క్రీమ్, బర్ఫీ స్వీట్‌లలో గంజాయి

స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి..



స్వాధీనం చేసుకున్న కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు (ఇన్‌సెట్‌లో) సిల్వర్ కోటెడ్ బాల్స్

సాక్షి, సిటీబ్యూరో/అబిడ్స్: హోలీ సంబరాలను సొమ్ము చేసుకొనేందు కు గంజాయి విక్రేతల ముఠా కొత్త పన్నాగం పన్నింది. హోలీ వేడుకల్లో భాగంగా శుక్రవారం లోయర్ ధూల్‌పేట్‌లో కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు, బర్ఫీ స్వీట్లకు సిల్వర్ కోటెడ్ బాల్స్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. 100 కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు, 72 బర్ఫీ స్వీట్లు, సిల్వర్ కోటెడ్ బాల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణ సింగ్ అనే వ్యక్తి కుల్ఫీ ఐస్‌క్రీమ్‌ల్లో గంజాయిని కలిపి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. గంజాయితో తయారైన వీటిని స్వాధీనం చేసుకుని, సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

హోలీ.. జాలీ



మొయినాబాద్: చిన్నారుల ఆనందోత్సాహం



ఇబ్రహీంపట్నంలో..

రంగుల కేళి.. హోలీ వేడుకలను శుక్రవారం జిల్లా వాసులు ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగి తేలారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చిన్నారులు నృత్యాలు చేస్తూ.. కేరింతలు కొడుతూ సందడి చేశారు. అంతా జాలీగా గడిపారు.



చేవెళ్ల: హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య



షాద్‌నగర్: హోలీ సంబురాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విలీనం చేస్తేనే.. ‘ఫ్యూచర్’

మా గ్రామాలను ఎఫ్‌సీడీఏలో కలపండి



కందుకూరు: నేదునూరు గేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

- సమీప గ్రామస్తుల నుంచి విజ్ఞప్తుల వెల్లువ
- ఇప్పటికే 56 రెవెన్యూ గ్రామాలతో ఏర్పాటు
- భూముల ధరలకు రెక్కలొస్తాయనే ఆశ
- మౌలిక సదుపాయాలు సమకూరుతాయనే భావన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాలను సైతం విలీనం చేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. 56 రెవెన్యూ గ్రామాలతో పాటు 765.25 స్క్వేర్ కిలోమీటర్ల పరిధిని 12 జోన్లుగా విభజించి.. భావినగరాన్ని అభివృద్ధి చేయనున్నట్లు సర్కార్ ప్రకటించింది. ఇప్పటికే హెచ్‌ఎండీఏ పరిధిలోని 36 గ్రామాలను తొలగించి, ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీలో విలీనం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా ఇప్పటికే ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కోసం ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేసింది. ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆర్‌ఆర్‌ఆర్(ఆమనగల్లు) వరకు 330 ఫీట్ల రేడియల్ గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు ఏర్పాటుకు భూ సేకరణ చేపట్టింది. అంతర్జాతీయ హంగులతో సుమారు 30 వేల ఎకరాల్లో కొత్తగా నిర్మించబోయే ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాలను కూడా విలీనం చేయాలనే విజ్ఞప్తులు ప్రభుత్వానికి అందుతున్నాయి. కొన్ని గ్రామాల ప్రజలైతే ఏకంగా అఖిలపక్షంగా ఏర్పడి ధర్నాలకు సైతం దిగుతుండడం విశేషం.

బతుకులు మారతాయనే..

ఐటీ, ఇండస్ట్రియల్ పరిశ్రమల రాకతో సమీప భూముల ధరలకు రెక్కలొచ్చే అవకాశం లేకపోలేదు. ఇప్పటి వరకు కనీస అభివృద్ధికి నోచుకోని తమ గ్రామాలను కొత్తసిటీలో కలపడం ద్వారా తమ జీవితాలు పూర్తిగా మారిపోతాయనే ఆశ స్థానికుల్లో వ్యక్తమవుతోంది. రోడ్లు, భవనాలు, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు భారీగా సమకూరుతాయనే భావనే ఈ విజ్ఞప్తులకు ప్రధాన కారణం

మరో 1,500 ఎకరాల సేకరణకు ప్లాన్..

ప్రభుత్వ ప్రతిపాదిత ఫోర్త్‌సిటీ కోసం ఇప్పటికే 13,973 ఎకరాలను సేకరించిన ప్రభుత్వం.. తాజాగా మరికొంత భూమిని సేకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఐటీ, పారిశ్రామిక, ఆతిథ్య, పర్యాటక, క్రీడారంగాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. కృత్రిమమేథ (ఏఐ) సిటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక వాణిజ్య భవనం సహా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, క్రికెట్ స్టేడియం తదితర ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు ఇందులో చోటు కల్పించనుంది. ఐటీ, ఇండస్ట్రియల్ పార్కుల పేరుతో కొత్తగా మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామం కొంగరకుర్దు సర్వే నంబర్ 289లోని 94 మంది రైతుల నుంచి 275.12 ఎకరాలు, కందుకూరు మండలం తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 9లోని 439 మంది రైతుల నుంచి 350.22 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. అదనంగా తిమ్మాపూర్‌లో 600 ఎకరాలు, పంజాగూడలో 300 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీకి నోటిఫికేషన్

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని 14 గ్రామాల మీదుగా వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డును రెండు దశల్లో నిర్మించాలని నిర్ణయించారు. ఫేజ్-1లో ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19.02 కిలోమీటర్ల మేర రూ.1,665 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఫేజ్-2లో భాగంగా మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమనగల్లు ఆర్‌ఆర్‌ఆర్ వరకు 22.30 కిలోమీటర్లు రూ.2,365 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు ఫిబ్రవరి 28న టెక్నికల్ బిడ్‌లను ఆహ్వానించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా హద్దురాళ్లను నాటే పనిలో నిమగ్నమయ్యారు. మార్చి 21న టెక్నికల్ బిడ్స్ తెరవనున్నారు. తాజాగా రోడ్డు నిర్మాణ సమయంలో పనులు పర్యవేక్షించేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సర్వీసులకు టెండర్లు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది.

విజ్ఞప్తి చేస్తున్న గ్రామాలు..

- కందుకూరు మండల పరిధిలో 35 గ్రామాలు ఉండగా, వీటిలో 26 ఇప్పటికే విలీనం చేశారు. మరో తొమ్మిది గ్రామాలు ఉన్నాయి. నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్, దావుద్ గూడతండా, పెద్దమ్మ తండా పంచాయతీలను సైతం ఫోర్త్‌సిటీలో కలపాలని కోరుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు అఖిలపక్షంగా ఏర్పడి ధర్నాకు కూడా దిగుతున్నారు. అఖిలపక్షం ప్రతినిధులు శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును స్వయంగా కలిసి ఇదే అంశంపై విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిసింది.
- యాచారం మండల పరిధిలో 24 పంచాయతీలు ఉండగా, వీటిలో ఇప్పటికే 17 గ్రామాలు విలీనం చేశారు. కొత్తగా మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్ గ్రామాల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి.
- కడ్తాల్ మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిలో 14 గ్రామాలు విలీనం చేశారు. కొత్తగా వాగ్దేవిపూర్, చల్లపల్లి, రావిచేడ్, న్యామతాపూర్, రేఖ్యాతండా, ముక్తమాదారం గ్రామాలను కలపాలని కోరుతున్నారు.
- ఆమనగల్లు మండలంలో 13 గ్రామాలు ఉండగా, వీటిలో రెండు విలీనం చేశారు. మిగిలిన గ్రామాలను ఎఫ్‌సీడీఏలో విలీనం చేయాలని కోరుతున్నారు.
- మాడ్గుల మండలంలోని నాగిళ్ల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.
- మహేశ్వరం మండలంలో 31 పంచాయతీలు ఉండగా, వీటిలో హర్షగూడ పంచాయతీ తుక్కుగూడ మున్సిపాలిటీలో విలీనం అయింది. తాజాగా తుమ్మలూరు, మహబత్‌నగర్‌ను ఫోర్త్‌సిటీలో విలీనం చేశారు. ఇదే మండలం నుంచి మరికొన్ని విజ్ఞప్తులు ప్రభుత్వానికి అందుతున్నాయి.

గ్రూపు-3లో మెరిసిన గిరిపుత్రుడు

రాష్ట్ర స్థాయిలో 63వ ర్యాంకు



దేవేందర్‌నాయక్

మహేశ్వరం: ఉద్యోగం చేస్తూనే ఉన్నత స్థాయికి వెళ్లాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివాడా యువకుడు. పేద కుటుంబంలో పుట్టి గ్రూప్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి సత్తా చాటాడు. మహేశ్వరం మండలం పెద్దమ్మ తండా గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న నల్లచెర్వు తండాకు చెందిన కాట్రావత్ దేవేందర్ నాయక్ శుక్రవారం వెల్లడించిన గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 63వ ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో శంషాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

సంతోషంలో తల్లిదండ్రులు

ఇటీవల విడుదలైన గ్రూప్-2, గ్రూప్-1, గ్రూప్-3 ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబర్చాడు. అంతకుముందు గ్రూప్-2 ఫలితాల్లో జోనల్ ఎస్టీ కేటగిరిలో 2వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 171వ ర్యాంకు సాధించాడు. గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో 433 మార్కులు సాధించారు. గ్రూప్-3 పరీక్ష ఫలితాల్లో ఎస్టీ కేటగిరిలో 2వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 63వ ర్యాంకు సాధించి మెరిశాడు. దీంతో ఏదైనా ఉన్నతోద్యోగం తమ కుమారుడికి వస్తుందని దేవేందర్‌నాయక్ తల్లిదండ్రులు లక్ష్మి, రాములు నాయక్ సంతోష పడుతున్నారు.

సైబర్ నేరాలకు చెక్ పెట్టేలా..

కొత్తగా ఐదు సైబర్ క్రైమ్ ఠాణాల ప్రతిపాదన

- జోన్‌కు ఒకటి చొప్పున ఏర్పాటుకు నిర్ణయం
- ప్రభుత్వానికి సైబరాబాద్ ఉన్నతాధికారుల ప్రతిపాదనలు
- ఏటా నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. ఎక్కడో విదేశాల్లో నక్కి, కమీషన్ల ఆశ చూపించి మధ్యవర్తులు, షెల్ కంపెనీలతో సైబర్ నేరస్తులు రూ.కోట్లు కొట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలను మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు సైబరాబాద్ పోలీసులు సన్నద్ధమవుతున్నారు. కొత్తగా ఐదు సైబర్ క్రైమ్ ఠాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కమిషనరేట్ పరిధిలో జోన్‌కు ఒకటి చొప్పున ఉండేలా కసరత్తు చేస్తున్నారు.

అత్యధికంగా ఇక్కడే..

రాష్ట్రంలో అత్యధికంగా సైబర్ నేరాలు నమోదయ్యే పోలీసు యూనిట్లలో సైబరాబాద్ కమిషనరేట్ తొలి స్థానంలో ఉంది. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రానికి కీలకమైన ఐటీ కారిడార్‌తో పాటు అంతర్జాతీయ సంస్థలు సైబరాబాద్ పరిధిలో ఉన్నాయి. వీటికి తోడు వివిధ రాష్ట్రాలకు చెందిన ఐటీ సంస్థలూ ఇక్కడే ఉన్నాయి. ఫలితంగా కేసుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. గతేడాది కమిషనరేట్‌లో 11,914 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో బాధితులు రూ.7,93,18,94,102 సొమ్మును పోగొట్టుకున్నారు. ప్రస్తుతం రోజుకు సగటున 30-35 కేసులు నమోదవుతున్నాయి.

అరెస్టులు 5 శాతం కంటే తక్కువే..

ప్రస్తుతం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఒక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఉంది. రూ.50 వేల కంటే తక్కువ పోగొట్టుకుంటే స్థానిక స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు. అంతకు మించి అయితే సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ క్రైమ్ కేసుల్లో డబ్బు రికవరీ సగటున 30 శాతం మించడం లేదు. నేరగాళ్ల అరెస్టులు సగటున 5 శాతం కూడా ఉండటం. లేదు. గతేడాది సైబరాబాద్‌లో కేవలం 372 కేసుల్లో 534 మంది నేరస్తులను మాత్రమే పోలీసులు అరెస్టు చేయగలిగారు. ఇతర రాష్ట్రాల్లో ఉండే నిందితుల్ని తీసుకు రావడానికి వారాల తరబడి పని చేయాల్సి వస్తోంది. కేవలం ఒకే పోలీస్ స్టేషన్ ఉండటంతో ఈ సమస్య వస్తోంది. జోన్‌కు ఒకటి చొప్పున సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఉంటే కేసుల పరిష్కారం పెరిగే అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

సైబరాబాద్ పరిధిలో ఇలా..

సంవత్సరం	కేసుల సంఖ్య	పోగొట్టుకున్న సొమ్ము
2022	4,866	రూ.77,92,46,505
2023	5,361	రూ.2,69,48,87,696
2024	11,914	రూ.7,93,18,94,102

ముప్పుతిప్పలు

ఎల్‌ఆర్‌ఎస్‌తో జనానికి చుక్కలు

- ముంచుకొస్తున్న గడువు
- తొలగని ఇబ్బందులు..
- హెచ్‌ఎండీఏలో 10 శాతం ఫైళ్లే పరిష్కారం



సాక్షి, సిటీబ్యూరో: స్థలాల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) జనానికి చుక్కలు చూపిస్తోంది. గడువులోగా స్థలాలను క్రమబద్ధీకరించుకొనేందుకు దరఖాస్తు చేసుంటున్నవారిని సాంకేతిక చిక్కుముడులు ముప్పు తిప్పలు పెడుతున్నాయి. ఫీజుల లెక్కలు సైతం గందరగోళానికి గురిచేస్తున్నాయి. కొంతమందికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కంటే ఓపెన్ స్పేస్ ఫీజులు ఎక్కువగా వస్తున్నాయి. కొందరికి భూమి మార్పునకు సంబంధించిన ఫీజులు తేలడం లేదు. మరోవైపు సాంకేతిక సమస్యలతో అధికారులు పరిష్కారం చూపలేక చేతులెత్తేస్తున్నారు. మార్చి 31వ తేదీ లోపు ఫీజు చెల్లిస్తే 25 శాతం తగ్గింపు లభిస్తుందనే ఉద్దేశంతో జనం ఆసక్తి చూపుతున్నారు. ఫీజులు చెల్లించిన వారికి ఇప్పటి వరకు ప్రొసీడింగ్స్ రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఫీజు చెల్లించిన వారికి మార్చి అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. దీంతో చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. హెచ్ ఎండీఏ పరిధిలో సుమారు 3.44 లక్షల దరఖాస్తులు ఉండగా.. ఇప్పటి వరకు 10 వేల దరఖాస్తులు కూడా పరిష్కారం కాకపోవడం గమనార్హం. ఒక్కో జోన్ పరిధిలో కనీసం వెయ్యి దరఖాస్తులను కూడా పరిష్కరించలేకపోయినట్లు అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న సాంకేతిక చిక్కులు

ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సాంకేతిక వ్యవస్థను రూపొందించింది. దీనిపై హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంతో పాటు వివిధ ప్రభుత్వ సంస్థల్లోని పట్టణ ప్రణాళికా విభాగాలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం వెబ్‌సైట్‌తో పాటు అధికారుల పనిని సులభతరం చేసేలా ఓ మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం అమలులో చిక్కులు ఎదురవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ‘ఒక్కోసారి సేకరించిన డాటా మొత్తం డిలీట్ అవుతోంది. దాంతో మరోసారి డాటా నమోదు చేసుకోవాల్సి వస్తోంది. ఒక పనిని ఒకటికి రెండుసార్లు చేయడంతో జాప్యం జరుగుతోంది’ అని ప్లానింగ్ అధికారి ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు హెచ్‌ఎండీఏ పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడంతో మొబైల్ యాప్ పని చేయడం లేదు. దీంతో చాలా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

దరఖాస్తుదారుల్లో గందరగోళం

ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రకటించింది. ఆ ఏడాది ఆగస్టు వరకు దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే ఇప్పుడు క్రమబద్ధీకరణ వర్తిస్తుంది. ఆ సంవత్సరం ప్రభుత్వం నిర్ణయించిన భూముల మార్కెట్ ధర ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజుల లెక్కల్లోనూ రకరకాల తప్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు. తప్పుడు ఫీజులు నమోదైన దరఖాస్తులను పరిశీలించి సవరించేందుకు సాంకేతికంగా మార్పులు చేయాల్సి వస్తోంది. ఈ సవరణలు అధికారులు స్వయంగా చేసేందుకు అవకాశం లేదు. సీజీజీలోనే సవరణ జరగాలి. దీంతో మరికొంత జాప్యం జరుగుతోంది. హెచ్‌ఎండీఏలోని శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ జోన్‌ల పరిధిలో తప్పులు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయి. రూ.4000 చొప్పున ఓపెన్ స్పేస్ ఫీజు నమోదు కావాల్సి ఉండగా.. కందుకూరు మండలం పులిమామిడిలో ఒక స్థలంలో ఏకంగా రూ.లక్షకు పైగా రావడంతో అధికారులే విస్మయానికి గురయ్యారు.

శివారు ప్రాంతాలు.. చోరీలకు నిలయాలు

- రెచ్చిపోతున్న దోపిడీ దొంగలు
- తరచూ ఇళ్లలో చోరీలు
- భయాందోళనలో ప్రజలు


కవాడిపల్లిలో చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్‌: హైదరాబాద్‌ నగర శివారులో దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని అందిన కాడికి దోచుకొని పరారవుతున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఇటీవల ఈ తరహా ఘటనలు కలవరం పెడుతున్నాయి. ప్రతి నిత్యం గ్రామాల్లో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నా వారి కళ్లను కప్పి కేటుగాళ్లు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఫిబ్రవరి నెలలో మండలంలోని రెండు దేవాలయాల్లో దొంగతనానికి పాల్పడగా, ఈ నెలలో ఇప్పటి వరకూ పలుచోట్ల ఇళ్లలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించుకుపోయి సవాల్‌ విసురుతున్నారు.

ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు

- గత నెల 18వ తేదీన పిగ్లీపూర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయంలో చోరీ జరిగింది. దొంగలు ఆలయంలోని విగ్రహానికి అమర్చిన 15 కిలోల వెండి తొడుగును అపహరించుకుపోయారు. వాహన తనిఖీల్లో ఈ నెల 4వ తేదీన ఆలయంలో దోపిడీకి పాల్పడిన ఇద్దరు దుండగులను పోలీసులు పట్టుకుని, వారి నుంచి 20 కిలోల వెండి బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు.
- అనాజ్‌పూర్‌ గ్రామంలో గత నెల 27వ తేదీన శివాలయంలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలోని రెండు హుండీలతో పాటు ఎల్‌ఈడీ లైట్లను అపహరించుకుపోయారు.
- మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామంలోని ఉదయ్‌గార్డెన్స్‌లో ఈ నెల 10వ తేదీన ఓ ఇంటి తాళాలు పగులగొట్టి 4 తులాల బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.లక్ష మేర నగదును దోచుకెళ్లారు.
- బలిజగూడ గ్రామంలోనూ ఇదే తరహాలో ఓ ఇంట్లో ఈ నెల 10వ తేదీన దొంగతనం జరగగా.. 3 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు, రూ.38 వేల నగదు అపహరించుకుపోయారు.
- తాజాగా గురువారం రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సాయినగర్‌ కాలనీలో నివాసముండే కొత్త రమేశ్‌ ఇంట్లోకి చొరబడిన దుండగులు 2.5 గ్రాముల బంగారు చెవి కమ్మలు, 20 తులాల వెండి పట్టీలు, 10 వేలు నగదును తస్కరించారు.

ఆలయంలో యాసిడ్‌ దాడి కలకలం

సైదాబాద్‌: ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై గుర్తు తెలియని యువకుడు యాసిడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. సైదాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి...ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధి లక్ష్మీనగర్‌ కాలనీలో నివసించే నర్సింగ్‌రావు (52) పెద్దతోటలోని శ్రీభూలక్ష్మీ మాత ఆలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆలయంలో ఉండగా అక్కడికి వచ్చిన గుర్తు తెలియని యువకుడు మొదట ఆలయంలో పూజలు, హోమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. కొన్ని పూజలకు ఇంత ధరలు ఎందుకు పెట్టారని వాగ్వాదానికి దిగాడని తెలుస్తోంది. అంతలోనే ఆ యువకుడు తనతో తెచ్చుకున్న యాసిడ్‌ వంటి కెమికల్‌తో నర్సింగ్‌రావుపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో నర్సింగ్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని మలక్‌పేటలోని ఒక ప్రైవేట్‌ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న సైదాబాద్‌ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆలయం, పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ ఆధారంగా ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. సైదాబాద్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.5లక్షల విలువైన విద్యుత్‌ వైర్లు చోరీ

యాచారం: ఐదు లక్షల రూపాయల విలువ జేసే విద్యుత్‌ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలివీ.. మండల పరిధిలోని గునుగల్‌ గ్రామంలో అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం ఇంజాపూర్‌ గ్రామానికి చెందిన నోముల కృష్ణాగౌడ్‌ బాలాజీ వెంచర్‌ను ఏర్పాటు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం వెంచర్‌లోని విద్యుత్‌ స్తంభాలకు ఉన్న రూ.5 లక్షల విలువ జేసే వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్లారు. సిబ్బంది సమాచారం మేరకు యజమాని యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యుత్‌ వైర్లతో పాటు విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం: చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు స్కూటర్‌పై నుంచి కింద పడి గాయాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఇబ్రహీంపట్నంకు చెందిన మత్స్యకార్మికుడైన చెరుకు కుమార్‌(60) పెద్ద చెరువు వద్ద నుంచి స్కూటర్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు గాయమైనట్లు తెలిపారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. మత్స్యకారుడైన కుమార్‌ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిహెచ్‌.శంకర్‌ శుక్రవారం ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

అనంతగిరి: కాంగ్రెస్‌ ప్రభుత్వం నియంతృత్వ పోకడలను మానుకోవాలని బీఆర్‌ఎస్‌ పార్టీ వికారాబాద్‌ పట్టణ అధ్యక్షుడు గోపాల్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సస్పెండ్‌ చేయడాన్ని ఖండిస్తూ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పని చేస్తుందన్నారు.

హత్య చేసిన నిందితుడికి రిమాండ్‌

- గతంలోనూ పలు కేసుల్లో ఉన్నట్లు నిర్ధారణ
- రాజేంద్రనగర్‌ డీసీపీ శ్రీనివాస్‌


వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్‌ డీసీపీ శ్రీనివాస్‌

షాబాద్‌: మద్యం దుకాణంలో దొంగతనం చేస్తూ, అడ్డొచ్చిన ఓ యువకుడిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి ఓ ఆగంతకుడు షాబాద్‌ మండల కేంద్రంలోని దుర్గా వైన్స్‌లో దూరి పర్మిట్‌ రూమ్‌లో పడుకున్న వ్యక్తిని హత్య చేసిన సంగతి విదితమే. శుక్రవారం రాజేంద్రనగర్‌ జోన్‌ డీసీపీ శ్రీనివాస్‌ విలేకర్ల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. వికారాబాద్‌ జిల్లా పూడూరు మండలం పుడుగుర్తి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి నరేందర్‌ జల్సాలకు అలవాటు పడి చోరీలను ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 12న అర్ధరాత్రి అతడు దుర్గా వైన్స్‌లో చోరీకి యత్నించాడు. వెనుక వైపు గోడకు సుత్తెతో రంధ్రం చేస్తుండగా.. శబ్దం విని అక్కడే పనిచేసే భిక్షపతి(35) పర్మిట్‌ రూమ్‌ నుంచి బయటకు వచ్చి గట్టిగా అరిచాడు. దీంతో నరేందర్‌ పారతో భిక్షపతి తలపై కొట్టాడు. విలవిలలాడుతూ అక్కడే అతడు మృతి చెందాడు. ఆ తర్వాత వైన్స్‌లో దూరి సుమారు రూ.40వేల నగదు, కొన్ని మద్యం బాటిళ్లను తీసుకొని పరారయ్యాడు.

సీసీ కెమెరా ఆధారంగా..

కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరా ఆధారంగా నిందితుడి నరేందర్‌గా గుర్తించారు. అతడిని శుక్రవారం ఉదయం సీతారాంపూర్‌ గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి బ్యాంక్‌ అకౌంట్‌ను నిలుపుదల చేసి కొంత సొత్తును రికవరీ చేశారు. కాగా నరేందర్‌పై గతేడాది బహదూర్‌పురా, అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు చోరీల కేసులో నేరస్తుడిగా ఉన్నట్లు పోలీసులు తేల్చారు. ఈ నెల 3న నాగర్‌గూడ వైన్స్‌లో దొంగతనానికి పాల్పడ్డాడని నిర్ధారించారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ హత్య కేసును 24 గంటల్లోగా ఛేదించినందుకు రాజేంద్రగనర్‌ జోన్‌, చేవెళ్ల ఏసీపీలు ప్రశాంత్‌, కిషన్‌, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్‌ కె.శశాంక్‌రెడ్డి, షాబాద్‌ సీఐ కాంతారెడ్డి బృందాలను డీసీపీ అభినందించారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

కేసు నమోదు చేసిన పోలీసులు


మాడ్గుల: బెల్ట్‌ షాపులో స్వాధీనం చేసుకున్న మద్యం

మాడ్గుల: బెల్ట్‌షాప్‌లో విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు మండల కేంద్రంలోని అంబాల యాదయ్యకు చెందిన మణికంఠ కిరాణం, ఈర్ల శ్రీనివాస్‌కు చెందిన జై హనుమాన్‌ కిరాణం, నాగిళ్ల గ్రామంలోని అగిర్‌ చంద్రశేఖర్‌ కిరాణం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.50వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.6 వేల విలువ..

యాచారం: అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలివీ.. మండల పరిధిలోని తమ్మలోనిగూడలో రాములు అనే వ్యక్తి కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు శుక్రవారం యాచారం పోలీసులు వెళ్లి దుకాణంలో తనిఖీ చేయగా రూ.6 వేల విలువ జేసే లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆదివాసీ సంఘీభావ వేదిక ఏర్పాటు

ముషీరాబాద్‌: ఉమ్మడి హైదరాబాద్‌ ఆదివాసీ సంఘీభావ వేదికను ఏర్పాటు చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్‌ భవన్‌లో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక కన్వీనర్లుగా దళిత లిబరేషన్‌ ఫ్రంట్‌ నుంచి ఇందిర, ప్రజా కళామండలి నుంచి రాణి, చైతన్య మహిళా సంఘం నుంచి జయ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నుంచి రవి, ఏఐఎఫ్‌టీయూ నుంచి మల్లేష్‌, పీడీఎస్‌యూ మహేష్‌, అమరుల బంధుమిత్రుల సంఘం సత్యను ఎంపిక చేశారు. అలాగే పౌర హక్కుల సంఘం హైదరాబాద్‌ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌ వేదిక కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని లక్ష్మణ్‌ తెలిపారు. ఆదివాసీలపై మారణహోమాన్ని నిలిపి వేయాలని, సహజ వనరుల దోపిడీని అరికట్టాలని, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని వారు డిమాండ్‌ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహం

పహాడీషరీఫ్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బాలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం లభ్యమయింది. ఇన్‌స్పెక్టర్‌ ఎం.సుధాకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామ పరిధి వీఐపీ కాలనీ బహిరంగ ప్రదేశంలో ఓ వ్యక్తి పడున్నాడన్న సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. కానీ అతను అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 52–55 ఏళ్ల మధ్య ఉంటుందని, సంబంధికులెవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌ లేదా.. 87126 62366 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

చెరువులో పడి మేస్త్రీ మృతి

కొడంగల్‌ రూరల్‌: తాగిన మైకంలో ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం రుద్రారం పరిధిలోని పాటిమీదిపల్లి భీరం చెరువులో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బషీరాబాద్‌ మండలం బాదులాపూర్‌తండాకు చెందిన రాథోడ్‌ మోహన్‌(46) మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం మద్యం తాగి బీరం చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత సరిగ్గా రాకపోవడంతో చెరువులో మునిగి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి భార్య సాలీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

వరకట్న వేధింపులకు యువతి బలి

అత్తాపూర్‌: వరకట్న వేధింపులతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటకలోని బీదర్‌కు చెందిన స్వప్న(27)కు అత్తాపూర్‌ పాండురంగ నగర్‌కు చెందిన అమరేష్‌కు రెండున్నర సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇటీవల కొద్దిరోజులుగా అమరేష్‌ అదనంగా కట్నం కావాలని భార్యను వేధిస్తున్నాడు. పెళ్లి సమయంలో పెట్టిన బంగారాన్ని తన అవసరాల నిమిత్తం తాకట్టు పెట్టడంతో పాటు అదనంగా డబ్బు కావాలని డిమాండ్‌ చేస్తూ వేధించసాగాడు. ప్రతిసారి ఇంటి నుంచి డబ్బులు తేలేక..వేధింపులు తట్టుకోలేక శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ, వ్యక్తి మృతి

పరిగి: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి రంగంపల్లి కాటన్‌మిల్లు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి నుంచి రంగంపల్లి వైపు హైదారాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై సుమారు 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి, గురువారం రాత్రి 10 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలై దుర్మరణం చెందాడు.

వినియోగదారుడా..బీ అలర్ట్‌!

- ఆర్థిక భారం లేకుండా న్యాయం పొందే అవకాశం
- ఈ చట్టం గురించి తెలుసుకుంటే ఎంతో మేలు

సిటీ కోర్టులు: మార్కెట్‌లో కొనుగోలు చేసిన వస్తువు నాణ్యత, సేవల పరంగా వినియోగదారుడికి ఏ విధమైన మోసం జరిగినా మేమున్నామంటూ వినియోగదారుల ఫోరం అండగా నిలుస్తోంది. కొనుగోలు చేసే వస్తువులపై గరిష్ట ధర (ఎమ్మార్పీ), ఎక్స్‌పైరీ తేదీ, కంపెనీ చిరునామా, ఫిర్యాదుల కోసం టోల్‌ ఫ్రీ నెంబరు తదితర వివరాలు ఉత్పత్తులపై ముద్రించాల్సి ఉంటుంది. పేర్కొన్న వివరాలకు, వస్తువు, సేవల్లో పొందిన వాస్తవానికి తేడాలున్నపుడు వినియోగదారుడు ఫోరాన్ని ఆశ్రయించవచ్చు. పైసా ఖర్చు లేకుండా కమిషన్‌లో కేసు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ఆర్థిక స్థోమత లేనివారు సొంతంగా తమ కేసును తామే వినిపించుకునే వెసులుబాటూ ఉంది. ఆన్‌లైన్‌లోనూ కేసు నమోదు చేసుకోవచ్చు. వర్చువల్‌గా కేసుల వాదనలు వినిపించుకోవచ్చు. రూ.50 లక్షల విలువైన వస్తువు, సేవల కోసం జిల్లా కమిషన్‌లో ఫిర్యాదు చేయాలి. రూ.2 కోట్ల వరకు రాష్ట్ర కమిషన్‌లో, అంతకుమించితే జాతీయ కమిషన్‌లో ఫిర్యాదు చేయాలి. వినియోగదారుడి హక్కులు, ప్రయోజనాల గురంచి తెలియజెప్పేందుకు మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కూడా నిర్వహిస్తున్నారు.

కేసుల పరిష్కారం ఇలా..

సంవత్సరం	నమోదైనకేసులు	పరిష్కారమైనవి
2023	1,076	1,274
2024	1,340	1,358
2025	113	159

వినియోగదారుల కమిషన్ల ఫోన్‌ నంబర్లు

- టోల్‌ ఫ్రీ నంబర్‌: 180042500333
- జాతీయ వినియోగదారుల కమిషన్‌, న్యూఢిల్లీ: ఫోన్‌ 011–24608724.
- తెలంగాణ రాష్ట్ర కమిషన్‌, హైదరాబాద్‌, ఫోన్‌: 040–23394399
- హైదరాబాద్‌ జిల్లా కమిషన్‌ ఎంజే రోడ్‌, నాంపల్లి, ఫోన్‌: 040–24733368, 040–24747733, 040–24746001
- రంగారెడ్డి జిల్లా కమిషన్‌, ఎన్‌టీఆర్‌ నగర్‌, ఎల్‌బీనగర్‌, ఫోన్‌: 040–24031275

త్వరతగతిన న్యాయం..



రాష్ట్రంలోని వినియోగదారులకు త్వరితగతిన న్యాయ సేవలు అందుతున్నాయి. న్యాయం కోసం కమిషన్‌ను ఆశ్రయించిన వారికి సత్వర న్యాయం జరిగేలా కృషి చేస్తున్నాం. వివిధ కంపెనీల నుంచి నష్టపోయిన వినియోగదారులు కేసులు వేసేవరకు రాకముందే ఆయా కంపెనీల యాజమన్యాలు వారి సమస్యలు పరిష్కరిస్తున్నాయి. ఇక కొత్తగా అమల్లోకి వచ్చిన జాగృతి ఆన్‌లైన్‌ సర్వీస్‌ ద్వారా వినియోగదారులు కేసులు ఆన్‌లైన్‌లోనే దాఖలు చేయవచ్చు.

– మీనా రామనాథన్‌, రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌ ఇన్‌చార్జి అధ్యక్షురాలు

సరైన రసీదు తీసుకోవాలి



వినియోగదారులు ఏదైనా వస్తువు కొన్నప్పుడు రసీదు తప్పక తీసుకోవాలి. ఆ వస్తువులో ఏదైనా లోపం ఉందని భావించినప్పుడు మీరు కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందడానికి ఆ రసీదు చాలా ఉపయోగపడుతుంది.

– రాంగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు, హైదరాబాద్‌ వినియోగదారుల ఫోరం–3

పల్లె గొంతెండుతోంది!

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు. మొన్న హస్నాబాద్‌.. ఇవాళ ఆలేడ్‌ గ్రామాలలో మిషన్‌ భగీరథ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగు నీటికి అరిగోస పడుతున్నారు.


పాఠశాల ట్యాంకు వద్ద నీటి కోసం గ్రామస్తుల పడిగాపులు

- ఆరు రోజులుగా భగీరథ సరఫరా బంద్‌
- తీవ్ర అవస్థలు పడుతున్న ఆలేడ్‌ గ్రామస్తులు
- స్పందించని అధికార యంత్రాంగం

దుద్యాల్‌: మండుటెండలు ముదురుతున్న తరుణంలో ప్రజలను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. మిషన్‌ భగీరథ నీటి సరఫరా నిలిచి ఆరు రోజులు గడుస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో కనీస అవసరాలకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని మండలంలోని ఆలేడ్‌ గ్రామస్తులు లబోదిబోమంటున్నారు. గ్రామానికి మిషన్‌ భగీరథ తాగునీటి సరఫరా ఆరు రోజులుగా బంద్‌ కావడంతో అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక గ్రామ సమీపంలోని వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకొని కాలం వెళ్లదీస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ అదే మాట

మిషన్‌ భగీరథ నీటి సరఫరా ఈ నెల 9 నుంచి బంద్‌ కావడంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సైతం చేయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కొందరు గ్రామానికి సరఫరా అయ్యే బోరును తమ వ్యవసాయ పొలాలకు వాడుతున్నారనే ఆరోపణ కూడా వ్యక్తం అవుతోంది. గ్రామానికి మిషన్‌ భగీరథ నీరు సరఫరా చేసే సంబంధిత వ్యక్తిని ఫోన్‌ ద్వారా సంప్రదించగా... పైపు లైన్‌ పగిలిపోయిందని, మరమ్మతులు చేస్తున్నారని సెలవిచ్చారు. గ్రామస్తులకు సైతం ఇదే సమాధాన్ని ఆరు రోజులుగా చెబుతుండడం గమనార్హం. మరోవైపు గ్రామంలోని పాఠశాలలో వేసిన బోరు నుంచి వచ్చే కొద్దిపాటి నీటితో కొందరు ఉపశమనం పొందుతున్నారు.

ధర్నా చేపడతాం

ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గ్రామంలో తాగునీటి సరఫరా చేయాలని కోరుతున్నారు. లేకుంటే అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేపడుతామని హెచ్చరిస్తున్నారు. ఊరిలో తాగునీటి సరఫరా ఇబ్బందిగా మారినప్పుడు గ్రామ పంచాయతీ ట్యాంకర్‌ సహాయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల హస్నాబాద్‌లో తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికార యంత్రాంగం స్పందించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అదే మాదిరి తమ గ్రామంలో చర్యలు తీసుకోవాలని ఆలేడ్‌ గ్రామస్తులు కన్నీటి'తో విజ్ఞప్తి చేస్తున్నారు.


నల్లాలో నీరు రావడం లేదని చూపుతున్న మహిళ